ప్రారంభానికి మోక్షమెప్పుడో?

- ఏడేళ్లుగా పూర్తికాని గోపాలమిత్ర భవన నిర్మాణం
- వినియోగించకుండానే శిథిలావస్థకు చేరుతున్న వైనం
- అంతర్గత పనులకు అందని నిధులు



కూచిపూడిలోని గోపాలమిత్ర భవనం

కోదాడరూరల్ : ప్రభుత్వం గ్రామాల్లో మూగ జీవాలకు మెరుగైన వైద్యం అందించేందుకు పశు వైద్య శాఖ నుంచి గోపాలమిత్ర నిధులతో గోపాల మిత్ర భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాడిరైతులు, జీవాల పెంపకం దారులు వాటికి వ్యాధులు సోకినపుడు వెంటనే వైద్య అందించే విధంగా గ్రామాల్లో గోపాలమిత్ర భవనాలు నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేసింది. ఈ భవనాలు నిర్మించడంతో అనేక గ్రామాల్లో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. అయితే మండల పరిధిలోని కూచిపూడిలో నిర్మించతలపెట్టిన భవనం మాత్రం నిధులు సరిపడకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం అంతర్గత పనులకు కావాల్సిన పనులకు అప్పటి నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో ఏడేళ్లుగా ఆ భవనం ప్రారంభానికి నోచుకొక శిథిలావస్థలకు చేరుకునే దుస్థితి నెలకొంది. అధికారులు ప్రతిపాదనలు పంపినా నేటి వరకు నిధులు రాకపోవడంతో ఎలాంటి పురోగతి లేదు.

7ఏళ్ల క్రితం ప్రారంభించిన పనులు..

మండలంలోని కూచిపూడిలో దాదాపుగా 7సంవత్సరాల కిందట రూ.7.50లక్షలతో గోపాలమిత్ర భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆ నిధులు ఉన్నంత వరకు పనులు వేగంగానే నిర్వహించారు. కాని కాని నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యిన తర్వాత ఎలక్ట్రికల్, శానిటేషన్, ఫ్లోరింగ్ వంటి అంతర్గత పనులు మిగిలిపోయాయి. దీంతో మిగిలిన పనులకు నిధులు లేకపోవడంతో అవి పూర్తి చేయకపోవడంతో అప్పటి నుంచి నేటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు. అయితే కాంట్రాక్టర్ నిర్మాణ సమయంలోనే అదనంగా మరో రూ.2లక్షలు కావాల్సిఉందని ప్రతిపాదనలు పంపినా వాటికి దిక్కు లేకుండా పోయింది. దీంతో సదరు కాంట్రాక్టర్ చేసేదిలేక మిగిలిన పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో ఆ భవనం ఇప్పటికీ ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి భవనానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి పాడిరైతులకు, జీవాల పెంపకందారులకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



గ్రామంలో నిర్మించిన గోపాలమిత్ర భవన నిర్మాణ పనులు చేపట్టి 7సంవత్సరాలు అవుతుంది. కాని ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోవడంలేదు. నిధులు సరిపోలేదని కాంట్రాక్టర్ పనులు పూర్తి పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో భవనం ఉత్సవ విగ్రహంలా మిగిలిపోయింది. అధికారులు నిధులు మంజూరు చేయించి ప్రారంభించాలి. అదేవిధంగా సిబ్బందిని నియమించాలి. వైద్యశాల ప్రారంభిస్తే జీవాల పెంపకందారుల సమస్య తీరుతుంది.

– శంకరశెట్టి కోటేశ్వరావు, ఎంపీటీసీ, కూచిపూడి

నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం



గ్రామంలో భవన నిర్మాణం ప్రారంభించి 7సంవత్సరాలు కావస్తుంది. దాదాపు భవనం పూర్తి అయ్యింది, కాని అంతర్గత పనులకు నిధులు సరిపోక కొన్ని పనులు నిలిచిపోయాయి. ఆ పనులకు సుమారు రూ.2.5లక్షల వరకు నిధులు అవసరం కానున్నాయి. వాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆ నిధులు మంజూరు కాగానే వెంటనే పనులు పూర్తిచేసి భవనాన్ని ప్రారంభిస్తాం.

– రాము, పీఆర్ఏఈ, కోదాడ

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోదాడఅర్బన్ : మునగాల జెడ్పీ పాఠశాలలో 1988–1989లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం కోదాడలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు ఎస్.భద్రయ్య, ఎస్.అప్పారావు, పీడీ రంగారావు, జి.సైదులు, సునందన దేవి, గుమ్మయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో వైభవంగా మహాసౌరహోమం

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

12నెలల వేతనం చెల్లించాలి

నాగారం : రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో అవర్లీ బేసిక్ టీచర్ (హెచ్‌బీటీ) పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని హెచ్‌బీటీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన హెచ్‌బీటీ ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న హెచ్‌బీటీల కు 12 నెలల వేతనం ఇవ్వాలని, నెలకు 100 పీరియడ్స్‌కు బదులుగా 120 పీరియడ్స్‌కు పెంచి ప్రస్తుతం ఇస్తున్న రూ.18,200జీతానికి బదులు రూ.25,000ల వేతనం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జహీర్ బాబా, నర్సయ్య, శిల్ప, కళింగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన శ్రీనివాస్, రాము

నడిగూడెం : మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లపు శ్రీనివాస్, కార్యదర్శిగా నాగవరపు రాము, ఉపాధ్యక్షుడిగా మేరె ధనయ్యతో పాటు మరో 15మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు దేవరంగుల వీరన్న, పసుపులేటి మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాడాలి

కోదాడ : పెన్షనర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై పెన్షనర్లు పోరాడాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కోదాడ ఎస్టీ పరిధి అధ్యక్షుడు గడ్డం వెంకటరెడ్డి, కార్యదర్శి వీరబాబు ఆదివారం అన్నారు. అదేవిధంగా ఈనెల 11న సూర్యాపేటలో జరిగే సంఘం ద్వితీయ మహాసభకు తరలిరావాలని కోరారు.

దీక్షను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : పెన్షనర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సూర్యాపేటలో నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు సోమయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

ఆకట్టుకున్న మహిళా డప్పు కళాకారుల ప్రదర్శన



ప్రతిభ కనబర్చిన మహిళా డప్పు కళాకారులు

గరిడేపల్లి : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 6,7,8తేదీల్లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉత్సవాల్లో మండలానికి చెందిన సతీష్ మహిళా డప్పు బృందం కళాకారుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. మారుమూల గ్రామాల్లో కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న వారికి రవీంద్రభారతి వేదికగా డాక్టర్ మామిడి హరికృష్ణ అవకాశాన్ని కలిపించినట్లు మహిళా డప్పు బృందం సభ్యులు పేర్కొన్నారు. పలు రకాల విన్యాసాలతో ప్రేక్షకులకు ఆకట్టుకున్న వారిలో కళా బృందం సభ్యులు సతీష్, అజిత, సుగుణ, సైదమ్మ, రేణుక, ధనమ్మ, జ్యోతి, నాగమణి, స్వరూప, సుజాత, సంధ్య, అనురాధ, వెన్నెల, కల్పన తదితరులున్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ దొంతగాని లక్ష్మమ్మ, ఆమె కుమారుడు మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌ను ఆదివారం పట్టణంలో బీఆర్ఎస్ ముస్లిం మైనార్టీ నాయకులు శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బాజిఉల్లా, సాధిక్, ఖాజా, జిలాని, యూసఫ్, రహీం, ఇమ్రాన్, మెహబూబ్ జాని, షఫీ, అక్బర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన కె.నాగార్జున ఇటీవల చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. దీంతో అతడికి ఆదివారం స్థానికులు కొంత నగదును వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.యోహాన్, రోజమ్మ, శ్యామ్, ఇర్మియ, జ్యోతి, శ్రీవిద్య తదితరులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

చిలుకూరు : మండల కేంద్రంలోని కోదాడ, జడ్చర్ల జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. దీంతో గ్రామసర్పంచ్ కొడారు వెంకటేశ్వర్లు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీధిదీపాలు ఏర్పాటుతో ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు.

రేషన్‌దుకాణం ప్రారంభం



రేషన్‌దుకాణం ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం, కిందితండా గ్రామపంచాయతీల పరిధిలోని రేషన్‌దుకాణాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్‌లు బానోతు నాగునాయక్, భూక్యా భరత్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఉన్న రేషన్ డీలర్ ఆకి కాశయ్య మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానానికి భూక్యా అనితను నూతన రేషన్‌డీలర్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని, దీంతో స్థానికులతో కలిసి నూతన దుకాణం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భూక్యా మాన్‌సింగ్, మాళోతు శ్రీను, మాళోతు నాగేశ్వరరావు, రేషన్‌డీలర్ భూక్యా అనిత తదితరులున్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడఅర్బన్ : వాసవీ క్లబ్ అధ్యక్షుడు సతీష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య

కోదాడఅర్బన్ : వాసవీ క్లబ్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు ఓరుగంటి బ్రహ్మం బ్రదర్స్ ఏర్పాటు చేసిన బేబి ఫీడింగ్ రూమ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. దాతల సహకారంతో చంటి పిల్లలకు పాలిచ్చేందుకు గదిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మడి సతీష్, దాతలైన ఓరుగంటి బ్రహ్మం, ఓరుగంటి రాము, ఓరుగంటి నవీన్, డాక్టర్ సతీష్‌కుమార్‌లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంపటి పద్మ, వాసవీ క్లబ్ సభ్యులు గురుమూర్తి, శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం పుణ్యకార్యమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రోషమ్మ వీధిలో ముస్లిం మైనార్టీ నాయకుడు జాకీర్‌హుస్సేన్ జ్ఞాపకార్థం వారి కుమారుడు మహమ్మద్ షాకీర్‌హుస్సేన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జబ్బార్, షేక్ నయీం, మహ్మద్ షాకీర్, పట్టణ మాజీ సర్పంచ్ పి.సత్యబాబు, భాగ్యమ్మ, ఖాజా మోయినుద్దీన్, ఫయాజ్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఖర్జూరా తినిపిస్తున్న ఎమ్మెల్యే

గట్టు సుశీలమ్మ మృతి బాధాకరం

మునగాల : మండలానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ స్వర్గీయ గట్టు వెంకట్రామయ్య సతీమణి గట్టు సుశీలమ్మ మృతి బాధాకరమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం గుండెపోటుతో మృతిచెందిన సుశీలమ్మ మృతికి ఆయన సంతాపం తెలిపారు. ఆదివారం మండలంలోని తాడువాయిలో ఆమె నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, పార్టీ నాయకులు కందిబండ సత్యనారాయణ, ఎంపీపీ ఎలక బిందు, వైస్ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, సొసైటీ డైరెక్టర్ గట్టు ఉపేందర్, మాజీ సర్పంచ్ లక్యానాయక్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిర్రా సైదులు, కోల ఆంజనేయులు, సొంపంగు గోపి, వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి, సాంబయ్య, పాపయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోదాడ : పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 217 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.70లక్షల,60వేల చెక్కులను పట్టణంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కోదాడ, అనంతగిరి, చిలుకూరు, మండలాల నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మహోన్నత క్షమాగుణ సంపన్నుడు



నేరేడుచర్ల : బ్రిలివర్స్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కోదాడఅర్బన్ : చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : ఏసుక్రీస్తు మహోన్నత క్షమాగుణ సంపన్నుడని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా పట్టణంలోని పలు చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన దేహానికి శీలలు కొడుతున్నా వారిని కూడా క్షమించండి అంటూ వేడుకున్న దయార్ధ హృదయుడని ఆయన కొనియాడారు. సర్వమతాలా సమ్మేళనానికి తెలంగాణ ఐకాన్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమాల్లో పాస్టర్లు రెవ వి.యేషయ్య, అబ్రహం, క్రైస్తవులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాల ఫెయిత్‌టెంపుల్ చర్చిలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ గడిపుడి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఏసు చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో కొండా పూర్ణ, పాస్టర్ రక్షకన్, నాగరాజు, నాగరత్నం, సుగుణమ్మ, భిక్షం తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని గుడ్‌న్యూస్, తిలక్‌నగర్ చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు జరిపించారు. కార్యక్రమాల్లో పాస్టర్ రాజు, క్రైస్తవులు, మహిళలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో క్రీస్తు శరీర దేవాలయం విచారణ గురువులు రెవా తుమ్మా ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో ఈస్టర్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లక్కమళ్ల రత్నం, పల్లె భాగ్యరాజు, పొదిల రాజు, రాజు, లంకరాజు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో గల పెనుయేలు చర్చిలో బిషప్ డా.జె.సుదర్శనం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏసుక్రీస్తు పునర్జన్మ గురించి క్లుప్తంగా వివరించారు. చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం కొవ్వొత్తులు వెలిగించి కీర్తనలు ఆలపిస్తూ చర్చిల్లో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ జెజె.సామ్యూల్‌సన్, ఉదయ్, సంఘపెద్దలు కె.రాజు, కరుణమ్మ, కరుణాకర్, సువార్త రాజు, కె.ఉపేందర్, నిరీక్షన్, జె.జాన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు చేపట్టారు. మండల కేంద్రంలోని బ్రిలివర్స్ చర్చిలో పాస్టర్ సుధాకర్ ప్రార్థనలు చేసిన అనంతరం మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఏసు క్రీస్తుపై ప్రేమ, అనురాగం ఉండాలన్నారు. సుఖసంతోషాలతో జీవించాలంటే ప్రతిఒక్కరూ ఏసు మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు యేసుక్రీస్తు మరణించిన అనంతరం లేచిన సంఘటనలను బోధించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో గల చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మానవాళి కోసం సిలువలో ప్రాణత్యాగం చేసిన యేసు క్రీస్తు మూడో రోజున సమాధి నుంచి సజీవంగా తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. మండలంలోని గడ్డిపల్లిలో మంచి కాపరి సంఘం చర్చిలో పాస్టర్ పోరండ్ల ఇమ్మానియేలు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ.. మానవాళి పాపక్షమాన కోరకే యేసు మరణించి మూడో రోజు తిరిగి లేచాడని అన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి, ప్రేమ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పుల్లయ్య, గాబ్రియేలు, అంజి, శ్రీను, రాజు, సైదులు, ఉపేందర్, సంధ్య, ధనమ్మ, అరుణ, స్వప్న, కవి శ్రీలేఖ, సరిత, రితికలతో పాటు పిల్లలు తదితరులున్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చిలో ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విచారణ గురువులు పాదర్ మార్టిన్, పాదర్ గాదె పాపిరెడ్డి చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు కొవ్వొత్తులతో చర్చి చుట్టూ ప్రదక్షిణగావించి పూజలు చేశారు. అదే విధంగా పాదర్లు ఉదయం చర్చిలో దివ్యబలిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫిలాత్ రాజు తీర్పుతో సిలువపై మరణదండనకు గురైన దైవకుమారుడైన ఏసుక్రీస్తు తిరిగి పునరుత్థానం (పునర్జన్మ)గావించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చర్చి కమిటీ పెద్దలు జార్జిరెడ్డి, బాల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, కె.బాలరెడ్డి, గాలి చిన్నపరెడ్డి, జోసెఫ్‌రెడ్డి, ఇన్నారెడ్డి, ఆంతోనిరెడ్డి, సంగా ఆంతోని, కాకుమాను జోసెఫ్, లూర్దురెడ్డి, క్రైస్తవులు, మహిళలు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..



గరిడేపల్లి : ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



చిలుకూరు : చిమిర్యాలలో పాల్గొన్న క్రైస్తవులు



మునగాల : ఈస్టర్ వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వైభవంగా స్వామివార్లకు చక్రస్నానం



స్వామివార్లను చక్రస్నానానికి తరలిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామ సమేత తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పూజా కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, బాలబోగం, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, అనంతరం గోదాదేవి సన్నిధిలో నవకలశ స్నాపనం, అభిషేకం, అర్చన, స్వామివార్లకు చక్రస్నానం (హనుమంత సేవ), వంతోత్సవం, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థప్రసాదగోష్టి కార్యక్రమాలతో పాటు, సాయంత్రం శ్రీపుష్పయాగం, దేవతద్వాసన, ద్వాదశ ఆరాధనలు, సప్తవర్ణం, దూపోత్సవం, తిరుమంగయాల్వార్ వైభవం, ధ్వజపట అవరోహణం, ఉద్వాసన, ఆరగింపు, మంగళాశాసనం, శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, పవన్‌కుమార్, గురవయ్య, రామకృష్ణ, మట్టపల్లి, అంజమ్మ, రామస్వామిగౌడ్, కిరణ్‌గౌడ్, లింగయ్య, అర్చకులు ముదుంబై శ్రీనివాసాచార్యులు, అనంతరచార్యులు, యజ్ఞాచార్యులు, మనోహరచార్యులు, హరిష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కోదాడ : పేపర్ లీకేజీలతో తీవ్రంగా నష్టపోయిన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ టీపీ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని ఆ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిపాల వేణుయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రంగా థియేటర్ వద్ద నిరుద్యోగులకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడారు. రూ.లక్షలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకున్న నిరుద్యోగుల పరిస్థితి అయోమయంగా మారిందని, ప్రతి నిరుద్యోగికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ఖాళీగా ఉన్న లక్షా 90వేల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్నెబోయిన రామారావు, నెమలి సుధాకర్, శ్యామ్, వేణు, సత్యం, జానీ, నగేష్, నవీన్, రాములమ్మ, సుధా, విజయ తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ శిక్షణ పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

హుజూర్‌నగర్ : గ్రామీణ వైద్యులైన ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం కమ్యూనిటీ పారా మెడికల్ శిక్షణ పూర్తి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రమాశంకర్ కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జీఓ నంబర్ 428ని సవరించి కమ్యూనిటీ పారా మెడికల్ శిక్షణ పూర్తిచేసి ధ్రువపత్రాలు అందించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు మన్సూర్‌అలీ, భుజంగరావు, షేక్ బాబు, అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఆర్డీఓ ప్రత్యేక పూజలు



ఆర్డీఓ వెంకారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ అధికారి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఆర్డీఓ వెంకారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు అభిషేకాలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ఆర్ఐ వాసు దేవరావు, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాపోలు నవీన్‌కుమార్

నేరేడుచర్ల : గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి ప్రారంభించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వైకుంఠాపురంలో రైతుల పంట పొలాల్లో నుంచి తీసుకవస్తున్న ధాన్యం ట్రాక్టర్లను పరిశీలించి మాట్లాడారు. వరికోతలు ప్రారంభమై 15రోజులు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరంగా ఉందన్నారు. ఐకేపీలు ప్రారంభం కాకపోవడంతో రైతులు దళారుల చేతుల్లో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దపంగ ఉపేందర్, మండల అధ్యక్షుడు తక్కెళ్ల నాగార్జున, నాయకులు సురేష్‌బాబు, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

డ్యాన్స్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

హుజూర్‌నగర్ : పట్టణంలోని అమ్మ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి సెలవుల డ్యాన్స్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం సీనియర్ కళాకారుడు దొంతగాని సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమి నిర్వాహకులు తుమ్మకొమ్ము నాంజి, సైదులు, కళాకారులు డి.రామకృష్ణ, గోవిందు, రాములు, జి.వెంకటేశ్వర్లు, జాన్‌సైదా, శీను, నాగయ్య పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడరూరల్ : ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ లారీని రూరల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఏపీలోని నందిగామ సమీపంలో గల గనిఆత్కూర్ ఇసుక రీచ్ నుంచి అనుమతులు లేకుండా హైదరాబాద్‌కు ఇసుక రవాణా చేస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్‌లో పట్టుకొని డ్రైవర్ కట్టా స్వామిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.